సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

శుక్రవారం । 6 । జనవరి । 2023



గిరిజనుల స్వయం ఉపాధికి కృషి

గిరిజన మహిళల ఆర్థికాభివృద్ధికి ట్రైకార్ పలు పథకాలు అమలు చేస్తోందని సంస్థ చైర్మన్ రామచంద్రనాయక్ తెలిపారు. 10లో



ఇంటర్ విద్యార్థులకు వరం..

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులను తీర్చిదిద్దేందుకు ఈ ఏడాది నుంచి పలు ప్రవేశ పరీక్షలకు కోచింగ్ ఇస్తున్నారు. 8లో



వాతావరణం

జిల్లాలో శుక్రవారం కొంత చలి పెరిగే అవకాశం ఉంది. మధ్యాహ్నం వేళల్లో మాత్రం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.

న్యూస్‌రీల్

కమనీయం.. రామయ్య నిత్యకల్యాణం



స్వామి వారిని ఊరేగింపుగా తీసుకొస్తున్న తహసీల్దార్ తదితరులు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక గురువారం కమనీయంగా జరిగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం నిర్వహించారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

'రెవెన్యూ' ఆధ్వర్యంలో రాపత్తు సేవ

శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో వైకుంఠ ఏకాదశి అధ్యయనోత్సవాల్లో భాగంగా గురువారం రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో రాపత్తు సేవ నిర్వహించారు. తొలుత పల్లకీలో స్వామివారిని వేంచేపు చేసి, మేళతాళాలు, భజనలు, కోలాటాల నడుమ ఊరేగింపుగా ఉదయ్‌భాస్కర్ రోడ్డు వద్ద ఉన్న మండపానికి తీసుకొచ్చారు. అక్కడ స్వామివారికి అర్చకులు ప్రత్యేక పూజలు చేసి హారతి సమర్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసయాదవ్, ఆర్‌ఐ నర్సింహారావు, రెవెన్యూ సిబ్బందితో పాటు ఆలయ అర్చకులు, వేద పండితులు పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లికి సువర్ణ పుష్పార్చన



అమ్మవారికి సువర్ణ పుష్పార్చన చేస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్ : మండల పరిధిలోని కేశవాపురం – జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువుదీరిన శ్రీ పెద్దమ్మతల్లి అమ్మవారికి గురువారం 108 సువర్ణ పుష్పాలతో అర్చన నిర్వహించారు. అనంతరం అర్చకులు మంత్ర పుష్పం, హారతి, నివేదన సమర్పించారు. ఆయా కార్యక్రమాల్లో ఆలయ ఈఓ ఎన్.రజనీకుమారి, అర్చకులు, వేదపడింతులు పద్మనాభశర్మ, రవికుమార్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

రేపు మెగా జాబ్‌మేళా

కొత్తగూడెంరూరల్: కొత్తగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జీఎస్‌ఆర్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యాన శనివారం మెగా జాబ్ మేళా ఏర్పాటుచేశారు. జీఎస్‌ఆర్ ట్రస్ట్ చైర్మన్, రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ గడల శ్రీనివాస్‌రావు ఆధ్వర్యాన నిర్వహించనున్న ఈ మేళాలో 80 కంపెనీల బాధ్యులు పాల్గొని అర్హులను ఉద్యోగాలకు ఎంపిక చేయనున్నారు. కాగా, శనివారం ఉదయం 9 గంటలకు మొదలయ్యే జాబ్‌మేళాలో పాల్గొనేందుకు అభ్యర్థులు జీఎస్‌ఆర్ ట్రస్ట్ వెబ్‌సైట్‌లో తమ పేర్లు నమోదు చేసుకోవాలని మేనేజర్ అంజి, కోఆర్డినేటర్ మోదుగు జోగారావు, సభ్యులు ప్రభాకర్, నరేశ్, ఉజ్జీవరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.


'డయల్ యువర్ ఎస్పీ'తో సత్వర న్యాయం



సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ వినీత్

కొత్తగూడెంటౌన్: డయల్ యువర్ ఎస్పీ కార్యక్రమంతో ప్రజల సమస్యలకు సత్వరమే పరిష్కారం లభిస్తుందని ఎస్పీ డాక్టర్ వినీత్ అన్నారు. గురువారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ప్రజలు తమ సమస్యలు పరిష్కరించుకునేందుకు ఇది మంచి అవకాశం అని, ఇలాంటి వేదికలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 20 మంది ఫోన్ చేసి సమస్యలు వివరించారని, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమం సోమవారం నిర్వహించాల్సి ఉండగా, భద్రాచలంలో ముక్కోటి ఏకాదశి వేడుకల సందర్భంగా గురువారానికి వాయిదా వేసిన విషయం తెలిసిందే.

కారులో లుకలుకలు!



బీఆర్‌ఎస్‌లో రగులుతున్న అసమ్మతి సెగలు

- అధికారపార్టీలోనే విపక్షంగా వ్యవహరిస్తున్న నేతలు
- పురపాలికల్లో తగ్గని వర్గపోరు
- తెరపైకి 'అవిశ్వాస' ప్రచారం

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం : ఎన్నికల వేళ తమ ఆధిపత్యం చూపించుకునేందుకు భారత రాష్ట్ర సమితి నేతలు సిద్ధమవుతున్నారు. ఫలితంగా ఆ పార్టీలో లుకలుకలు బయటపడుతున్నాయి. ఏడాది క్రితం మున్సిపాలిటీల్లో మొదలైన అసమ్మతి సెగలు క్రమంగా మండలాలకు, నియోజకవర్గాలకు విస్తరిస్తూ రాజకీయ వేడి రాజేస్తున్నాయి.

తిరుగులేని శక్తిగా..

తెలంగాణ అసెంబ్లీకి 2018లో జరిగిన సాధారణ ఎన్నికల్లో జిల్లాలో భారత రాష్ట్ర సమితికి చేదు ఫలితాలు వచ్చాయి. జిల్లాలో ఐదు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా అన్నిచోట్లా ఆ పార్టీ అభ్యర్థులు ఓటమిపాలయ్యారు. అయితే ఆ తర్వాత కాలంలో కాంగ్రెస్ నుంచి గెలిచిన ముగ్గురు ఎమ్మెల్యేలు, టీడీపీ నుంచి గెలిచిన ఒకరు.. మొత్తం నలుగురు ఎమ్మెల్యేలు బీఆర్‌ఎస్‌లో విలీనం అయ్యారు. అంతే కాదు.. సాధారణ ఎన్నికల తర్వాత జరిగిన మున్సిపాలిటీ, స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ బీఆర్‌ఎస్ అభ్యర్థులు ఎక్కువ స్థానాల్లో విజయం సాధించారు. దీంతో గ్రామ పంచాయతీలు మొదలు మండల పరిషత్, జిల్లా పరిషత్, మున్సిపాలిటీల్లో గులాబీ జెండా రెపరెపలాడింది. 2018 సాధారణ ఎన్నికల్లో జిల్లా వ్యాప్తంగా గడ్డు ఫలితాలు చవిచూసిన గులాబీ పార్టీ ఆ తర్వాత రెండేళ్ల కాలంలోనే తిరుగు లేని శక్తిగా అవతరించడంతో బీఆర్‌ఎస్ కేడర్‌లో నమ్మకం కలిగింది.

మున్సిపాలిటీల్లో మొదలైన వర్గపోరు..

జిల్లా కేంద్రమైన కొత్తగూడెం, ఇల్లెందు మున్సిపాలిటీలు బీఆర్‌ఎస్ ఖాతాలోనే ఉన్నాయి. అయితే ఏడాది కాలంగా ఈ రెండు మున్సిపాలిటీల్లో అధికార పార్టీ కౌన్సిలర్లలో వర్గపోరు మొదలైంది. ఇల్లెందు మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వర్లు, కొత్తగూడెం మున్సిపల్ చైర్‌పర్సన్ సీతాలక్ష్మికి వ్యతిరేకంగా కొందరు కౌన్సిలర్లు తమ అసంతృప్తిని బహిరంగపరచడం ప్రారంభించారు. ఇల్లెందులో అయితే ఏకంగా కేసులు పెట్టుకునే వరకు వెళ్లగా.. కొత్తగూడెంలో మున్సిపల్ కార్యాలయంలోనే ధర్నాలు చేస్తున్నారు. ఈ రెండు మున్సిపాలిటీల్లో అధికార పార్టీ నేతలే విపక్ష పాత్ర పోషించడం పార్టీలో నెలకొన్న ఆధిపత్య పోరుకు అద్దం పడుతోంది. ఈ ఏడాది కాలంలో అటు మంత్రి పువ్వాడ, ఇటు విప్, జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు ఇతర నేతలు చేసిన సంధి యత్నాలు నిష్ఫలం అయ్యాయి.

ఇక్కడ మీకేం పని..

గత అసెంబ్లీ ఎన్నికల్లో భద్రాచలం నుంచి బీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి పాలైన తెల్లం వెంకట్రావు ఇటీవల మీడియా సమావేశం ఏర్పాటు చేసి జిల్లాకు చెందిన బీఆర్‌ఎస్ నేతలపై ఘాటైన విమర్శలు చేశారు. తన అనుమతి లేకుండా మంత్రులు, ఎమ్మెల్యేలు ఎవరూ నియోజకవర్గంలో కార్యక్రమాలు చేపట్టవద్దని అన్నారు. ఈ సెగ్మెంట్‌లో తన మాటే సుప్రీం అంటూ తేల్చి చెప్పారు. ఆయనకు అండగా మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ నిలిచారు. కొత్తగూడెం నియోజకవర్గంలో సిట్టింగ్ ఎమ్మెల్యే వనమా విస్తృతంగా పర్యటిస్తూ కేడర్‌లో బలం పెంచుకునే పనిలో ఉండగా, మాజీ ఎమ్మెల్యే జలగం వెంకట్రావు సైతం తన వర్గానికి చెందిన నేతలతో రెగ్యులర్‌గా టచ్‌లో ఉంటున్నారు. ఫలితంగా ఇక్కడా పార్టీలో రెండు గ్రూపులు ఉన్నట్టయ్యింది.

తెరపైకి కొత్త ప్రచారం..

బీఆర్‌ఎస్‌లో పెరిగిపోతున్న అసమ్మతి, వర్గపోరు చివరకు బల ప్రదర్శనకు దారి తీస్తుందనే ప్రచారం గత కొద్ది కాలంగా జోరుగా సాగుతోంది. ఇల్లెందు, కొత్తగూడెం మున్సిపాలిటీలతో పాటు జిల్లా పరిషత్ చైర్మన్‌కు వ్యతిరేకంగా అవిశ్వాస తీర్మానం పెడతారనే ప్రచారం మొదలైంది. ఇప్పటికే ఈ స్థానిక సంస్థలకు పాలకమండళ్లు ఏర్పాటై మూడేళ్లు దాటుతోంది. చట్ట ప్రకారం అవిశ్వాసం పెట్టేందుకు అవకాశం ఉంది. అయితే నాలుగేళ్ల వరకు అవిశ్వాస తీర్మానం పెట్టవద్దంటూ గతంలో అసెంబ్లీలో ప్రభుత్వం ప్రకటన చేసింది. దీనికి అధికార పార్టీ కట్టుబడి ఉన్నట్టయితే ఇప్పట్లో అవిశ్వాసానికి అవకాశం లేనట్టేనని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు.

లెక్క తేలింది..

- కొత్తగూడెం నియోజకవర్గంలో అత్యధిక ఓటర్లు
- భద్రాచలంలో అత్యల్పం..
- కొత్తగా ఓటు హక్కు పొందిన వారు 28,441 మంది
- జాబితా నుంచి తొలగించిన ఓట్లు 12,605



సాక్షి ప్రతినిధి, భద్రాద్రికొత్తగూడెం: సవరించిన ఓటర్ల తుది జాబితాను రాష్ట్ర ఎన్నికల సంఘం గురువారం విడుదల చేసింది. ఇందులోని వివరాల ప్రకారం జిల్లాలో అత్యధిక మంది ఓటర్లు ఉన్న నియోజకవర్గంగా కొత్తగూడెం నిలిచింది. ఈ సెగ్మెంట్‌లో అత్యధికంగా 2,28,056 మంది ఓటర్లు ఉన్నారు. అతి తక్కువగా భద్రాచలం నియోజకవర్గంలో 1,42,813 మంది ఉన్నారు. రాబోయే సార్వత్రిక ఎన్నికలను పురస్కరించుకుని రాష్ట్ర ఎన్నికల సంఘం ఓటర్ల జాబితాలో సవరణలు చేపట్టింది. గత ఎన్నికల తర్వాత కొత్తగా ఓటు హక్కు నమోదు చేయించుకున్న వారు, ఇతర ప్రాంతాలకు వెళ్లడం, మరణించడం తదితర కారణాలతో ఓటు హక్కు తొలగించిన వారితో కూడిన ముసాయిదా జాబితాను గతేడాది నవంబర్ 9న ప్రకటించింది. ఆ జాబితాపై అభ్యంతరాలను స్వీకరించి, వాటిని పరిశీలించిన ఈసీ గురువారం తుది జాబితాను వెలువరించింది. జిల్లా ఓటర్ల జాబితాలో కొత్తగా 28,441 మందికి చోటు దక్కింది. ఇందులో అత్యధికంగా కొత్తగూడెం నియోజకర్గంలోనే 7,370 మందికి ఓటు హక్కు వచ్చింది. ఆ తర్వాత పినపాకలో 7,148 మంది ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా 12,605 మందిని ఓటర్ల జాబితా నుంచి తొలగించారు. అత్యధికంగా పినపాక నియోజకవర్గం నుంచి 4097 మందిని తొలగించారు. జిల్లా వ్యాప్తంగా ఐదు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా ఇందులో కొత్తగూడెం, పినపాక మాత్రమే పూర్తిగా జిల్లాలో ఉన్నాయి. ఇల్లెందు నియోజకవర్గం భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, ఖమ్మం జిల్లాల్లో విస్తరించి ఉంది. భద్రాచలంలో కొన్ని మండలాలు ఏపీకి పోగా మిగిలిన వాటిలో రెండు మండలాలు ములుగు జిల్లాలో, మూడు మండలాలు ఈ జిల్లాలో ఉన్నాయి. అశ్వారావుపేట పరిధిలో రెండు మండలాలు ఏపీ పరిధిలోకి వెళ్లాయి. ఏపీ పరిధిలోకి వెళ్లిన మండలాలు అక్కడి ఓటర్లను ఈ జాబితాలో పరిగణనలోకి తీసుకోలేదు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పది నియోజకవర్గాలను పరిగణనలోకి తీసుకుంటే అత్యధిక ఓటర్లు ఖమ్మం (3,08,403) ఉన్నారు. మధిర, పాలేరు, ఖమ్మం, కొత్తగూడెం, ఇల్లెందు నియోజకవర్గాల్లో ఓట్ల సంఖ్య రెండు లక్షలకు పైగా నమోదైంది. మిగిలిన ఐదు చోట్ల రెండు లక్షల లోపే ఓటర్లు ఉన్నారు.

నియోజకవర్గం	మొత్తం ఓట్లు	కొత్త ఓటర్లు	తొలగింపు	ఎన్‌ఆర్‌ఐ ఓటర్లు
పినపాక	1,85,903	7,148	4,097	4
ఇల్లెందు	2,08,151	4,612	1,387	6
కొత్తగూడెం	2,28,056	7,370	3,564	25
అశ్వారావుపేట	1,49,322	5,895	2,608	6
భద్రాచలం	1,42,813	3,416	949	1
మొత్తం	9,14,245	28,441	12,605	42

ఈవీఎం గోదాం తనిఖీ

సూపర్‌బజార్(కొత్తగూడెం): కలెక్టరేట్ ప్రాంగణంలో ఉన్న ఈవీఎం, వీవీ ప్యాట్ గోదాంను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అనుదీప్ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ప్రతి మూడు నెలలకోసారి రాజకీయ నాయకుల సమక్షంలో ఈవీఎం, వీవీ ప్యాట్ గోదాంను తనిఖీ చేస్తున్నట్లు తెలిపారు. తనిఖీ అనంతరం రిజిస్టర్‌లో సంతకం చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కె. వెంకటేశ్వర్లు, డీఆర్‌ఓ అశోకచక్రవర్తి, కలెక్టరేట్ ఏఓ గన్యా, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు ఎం.ఎ. రాజు, సిబ్బంది నవీన్, ఆయా పార్టీల నాయకులు సుధాకర్(కాంగ్రెస్), లక్ష్మణ్ అగర్వాల్ (బీజేపీ), మాలోత్ వీరూనాయక్(బీఎస్పీ), శ్రీనివాసరెడ్డి(సీపీఐ), బొల్లోజు మోహనాచారి (టీడీపీ) పాల్గొన్నారు.

'కంటి వెలుగు'ను సక్సెస్ చేయండి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, పక్కన కలెక్టర్ అనుదీప్, ఎమ్మెల్యేలు వనమా వెంకటేశ్వరరావు, హరిప్రియ, ఎమ్మెల్సీ తాతా మధు తదితరులు

- 18 నుంచి కార్యక్రమం షురూ..
- అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో వ్యవహరించాలి
- ప్రజలకు ఇబ్బందులు రానివ్వొద్దు
- రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

చుంచుపల్లి: జిల్లాలో ఈనెల 18న ప్రతిష్టాత్మకంగా ప్రారంభించనున్న రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని సమష్టి కృషితో విజయవంతం చేయాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కొత్తగూడెం క్లబ్‌లో గురువారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ఆలోచన నుంచి రూపుదిద్దుకున్న అద్భుత కార్యక్రమం కంటి వెలుగు అని కొనియాడారు. కంటి చూపు ఎంత ముఖ్యమో ప్రతి ఒక్కరికీ తెలుసని, మానవతా దృక్పథంతో చేపట్టిన ఈ కార్యక్రమం విజయవంతం అయ్యేలా అధికారులు అంకిత భావంతో కృషి చేయాలని అన్నారు. ఇందులో ప్రజాప్రతినిధులు, అధికారులందరినీ భాగస్వాములు చేయాలని సూచించారు. మొదటి విడత కంటి వెలుగు కార్యక్రమంలో రాష్ట్రంలో 1.54 కోట్ల మందికి నేత్ర పరీక్షలు నిర్వహించి, 50 లక్షల మందికి కంటి అద్దాలు పంపిణీ చేసి చరిత్ర సృష్టించామని చెప్పారు. ఇదే స్ఫూర్తితో మలివిడత కార్యక్రమాన్నీ విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కంటి వెలుగు క్యాంపుల సందర్భంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ అనుదీప్ ఆధ్వర్యంలో జిల్లా అధికారులు ఉత్తమ సేవలు అందిస్తున్నారని అభినందించారు. గోదావరి వరదలు, ఇటీవలి రాష్ట్రపతి పర్యటన, ముక్కోటి ఏకాదశి వేడుకల సందర్భంగా సమర్థంగా విధులు నిర్వహించారని ప్రశంసించారు. కలెక్టర్ అనుదీప్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 481 గ్రామాలు, 4 మున్సిపాలిటీల్లో 48 టీమ్‌ల ద్వారా 7.90 లక్షల మందికి కంటి పరీక్షలు చేసేందుకు ఏర్పాట్లు చేశామని తెలిపారు. ప్రతి రోజూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 వరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పారు. శని, ఆదివారాలతో పాటు అన్ని ప్రభుత్వ సెలవు రోజుల్లో క్యాంపులు ఉండవని స్పష్టం చేశారు. ఈనెల 18 నుంచి జూన్ 20 వరకు మొత్తం 100 రోజుల పాటు ఈ కార్యక్రమం నిర్వహిస్తామని వివరించారు. ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ రావు, ఎమ్మెల్యేలు వనమా వెంకటేశ్వరరావు, హరిప్రియ మాట్లాడుతూ కంటి వెలుగు కార్యక్రమం అనేక మంది నిరుపేదల జీవితాల్లో వెలుగులు నింపుతుందని చెప్పారు.

జిల్లాల విభజనతోనే అభివృద్ధి

పాల్వంచ : రాష్ట్రంలో జిల్లాల విభజనతోనే అభివృద్ధి వేగవంతం అయిందని మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. పాల్వంచలో రూ.41 లక్షలతో చేపడుతున్న బస్టాండ్ మరమ్మతు పనులు, రూ.5 కోట్లతో చేపడుతున్న రోడ్డు విస్తరణ, సెంట్రల్ లైటింగ్ పనులకు స్థానిక ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు, ఎమ్మెల్సీ తాతా మధుతో కలిసి గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. జీఓ 58 ద్వారా దరఖాస్తు చేసుకున్న పేదలకు పట్టాలు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. రాష్ట్రంలోనే ఎక్కడా లేని విధంగా సుజాతనగర్, కొత్తగూడెం నుంచి పాల్వంచ పెద్దమ్మ గుడి వరకు అతి పెద్ద సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేశామని చెప్పారు. భద్రాద్రి జిల్లా ఏర్పాటు తర్వాత కలెక్టరేట్, మెడికల్ కళాశాల వంటివి అందుబాటులోకి వచ్చాయన్నారు. ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు కోరిక మేరకు కొత్తగూడేనికి రూ.80కోట్లు, పాల్వంచకు రూ.60కోట్ల నిధులను సీఎం కేసీఆర్ త్వరలోనే మంజూరు చేయనున్నారని తెలిపారు. కొత్తగూడెం సింగరేణిలో జీఓ 76 ద్వారా పట్టాలు ఇవ్వడంతో ఇతర సింగరేణి ప్రాంతాల్లోనూ క్రమబద్ధీకరణ చేస్తున్నారని చెప్పారు. పాల్వంచ – కొత్తగూడెం జంట పట్టణాలను అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో వనమా ముందుకు వెళుతున్నారని, అందుకు తమ సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. రాష్ట్రంలోనే అనుభవజ్ఞుడైన నేత వనమా అని అన్నారు. నియోజకవర్గాల్లో సిట్టింగ్ ఎమ్మెల్యేలకే అధిష్టానం అధిక ప్రాధాన్యత ఇస్తుందని చెప్పారు. ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తాను వార్డు మెంబర్ స్థాయి నుంచి మంత్రిగా పనిచేసిన అనుభవం ఉందని, ప్రజలతో నిత్యం మమేకం అయి వారి కష్టాసుఖాల్లో పాలుపంచుకుంటు ముందుకు వెళుతున్నానని అన్నారు. కేఎస్‌పీ రోడ్డు విస్తరణ తర్వాత దమ్మపేట సెంటర్ నుంచి శ్రీనివాస కాలనీ వరకు రోడ్డు విస్తరణ, వెంకటేశ్వర స్వామి గుట్టపైకి రోడ్డు నిర్మాణాలు కూడా చేపడుతామని చెప్పారు. ఎమ్మెల్సీ తాతా మధు మాట్లాడుతూ కేసీఆర్ నాయకత్వంలో అనేక సంక్షేమ పథకాలు అమలవుతున్నాయన్నారు. ఆయా కార్యక్రమాల్లో డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దిండిగల రాజేందర్, జెడ్పీ వైస్ చైర్మన్ చంద్రశేఖర్‌రావు, కొత్తగూడెం, ఇల్లెందు మున్సిపల్ చైర్మన్లు కాపు సీతాలక్ష్మి, డి.వెంకటేశ్వర్లు, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, జిల్లా వైద్యాధికారి డాక్టర్ శిరీష, ఆస్పత్రుల సమన్వయ అధికారి డాక్టర్ రవిబాబు, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, పాల్వంచ మున్సిపల్ కమిషనర్ సీహెచ్.శ్రీకాంత్, తహసీల్దార్ రంగా ప్రసాద్ పాల్గొన్నారు.

బీటీపీఎస్‌లో విస్తృత తనిఖీలు

మణుగూరు రూరల్: మణుగూరులోని బీటీపీఎస్‌లో సీఈ బిచ్చన్న గురువారం విస్తృత తనిఖీలు చేపట్టారు. ప్లాంట్‌లోని ఈటీపీ, ఎస్‌టీపీ, బాయిలర్ విభాగాలను పరిశీలించారు. ఆయా విభాగాల్లో పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో బీటీపీఎస్, బీహెచ్‌ఈఎల్ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎర్రజెండా ఎప్పటికీ సజీవమే..

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని

చర్ల: ఎర్రజెండా పేదల మదిలో ఎప్పటికీ సజీవంగానే ఉంటుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. చర్ల మండల కేంద్రంలో గురువారం జరిగిన పార్టీ నియోజకవర్గ స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. పదవుల కోసం కక్కుర్తి పడే, పైసల కోసం పార్టీ మారే నీచ సంస్కృతి తమకు లేదన్నారు. పూర్వపు భద్రాచలం నియోజకవర్గం ప్రస్తుతం ముక్కలు చెక్కలైందని, కూనవరం, వీఆర్‌పురం, చింతూరు మండలాలు ఏపీలో, వాజేడు, వెంకటాపురం మండలాలు ములుగు జిల్లాలో కలిశాయని అన్నారు. అయితే తమది చిన్న పార్టీ అని కొందరు మాట్లాడడం వారి అవివేకమని విమర్శించారు. చిల్లర డబ్బులు వెదజల్లి ప్రజలను మభ్యపెట్టడం తమవల్ల కాదని, నమ్మిన సిద్ధాంతం కోసం పని చేయడమే సీపీఐ లక్ష్యమని స్పష్టం చేశారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకులు బాగం హేమంతరావు, రావులపల్లి రాంప్రసాద్, కల్లూరి వెంకటేశ్వరరావు, భద్రాద్రి, ములుగు జిల్లాల కార్యదర్శులు ఎస్‌కె సాబీర్‌పాషా, తోట మల్లికార్జునరావు, రావులపల్లి రవికుమార్, తమ్మళ్ల వెంకటేశ్వరావు, నూపా పోతయ్య, ఆకోజు సునీల్‌కుమార్, పర్శిక బాలకృష్ణ, కోడి రమేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కూనంనేని సాంబశివరావు, పక్కన హేమంతరావు, సాబీర్‌పాషా తదితరులు

7, 8 తేదీల్లో న్యాయ చైతన్య సదస్సులు

జిల్లా జడ్జి చంద్రశేఖరప్రసాద్ వెల్లడి



కలెక్టర్ తదితరులతో మాట్లాడుతున్న జడ్జి చంద్రశేఖర ప్రసాద్

కొత్తగూడెంటౌన్: ఈ నెల 7, 8 తేదీల్లో మణుగూరు, భద్రాచలం, ఇల్లెందు డివిజన్లలో న్యాయ చైతన్య సదస్సులు నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి పసుపులేటి చంద్రశేఖర ప్రసాద్ తెలిపారు. కలెక్టర్ అనుదీప్, ఇతర న్యాయమూర్తులతో గురువారం ఆయన జిల్లా కోర్టులో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జిల్లాలోని మారుమూల గ్రామాల్లో సమస్యలు గుర్తించి, కలెక్టర్. రెవెన్యూ అధికారుల సమన్వయంతో సత్వర న్యాయం అందించేందుకే ఈ సదస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. సమావేశంలో ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి. భానుమతి, కొత్తగూడెం డీఎస్పీ వెంకటేశ్వరబాబు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు వరం..

- ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పోటీ పరీక్షలకు కోచింగ్
- జిల్లాలోని 14 ప్రభుత్వ కళాశాలల్లో శిక్షణ ప్రారంభం
- ప్రైవేటుకు ధీటుగా సంసిద్ధులను చేస్తున్న బోర్డు
- మెటీరియల్, ఇతర సదుపాయాలు కల్పిస్తే ఇంకా మేలు


పాఠం వింటున్న విద్యార్థులు (ఇన్‌సెట్) బోధిస్తున్న అధ్యాపకుడు

కొత్తగూడెంఅర్బన్: ప్రైవేటు కళాశాలలకు ధీటుగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులను తీర్చిదిద్దేందుకు ఇంటర్మీడియట్ బోర్డు కృషి చేస్తోంది. ఈ క్రమంలోనే ఈ ఏడాది నుంచి ఎంసెట్, జేఈఈ, నీట్ ప్రవేశ పరీక్షలకు కోచింగ్ ప్రారంభించింది. ప్రస్తుతం జిల్లాలోని 14 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఎంపీసీ, బైపీసీ విద్యార్థులు శిక్షణ పొందుతున్నారు. ప్రైవేటు జూనియర్ కళాశాలల్లో కోచింగ్‌తోపాటు ఇంటర్మీడియట్ విద్యకు రూ. లక్షల్లో ఫీజు వసూళ్లు చేస్తున్నారు. కేవలం కోచింగ్‌కే రూ. 50 వేల వరకు తీసుకుంటున్నారు. ప్రభుత్వ కళాశాలల్లో ఉచితంగా కోచింగ్ ఇస్తుండటంతో విద్యార్థులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వచ్చే ఏడాదిలో ప్రభుత్వ కళాశాలల్లో అడ్మిషన్ల సంఖ్య కూడా పెరిగే అవకాశం ఉందని అధ్యాపకులు చెబుతున్నారు. గతంలో విద్యార్థులకు ప్రతిభా పరీక్ష నిర్వహించి, ఉత్తీర్ణులైన వారికి వేసవి సెలవుల్లో అన్ని కళాశాలల విద్యార్థులను ఒకచోటకు చేర్చి కోచింగ్ ఇచ్చేవారు. ఇప్పుడు 14 కళాశాలల్లో కోచింగ్ ఇస్తుండటంతో ఎక్కువ మంది విద్యార్థులకు ఉపయోగం జరుగుతోంది.

రోజుకు రెండు గంటలు..

ఈ నెల 2వ తేదీ నుంచి కోచింగ్ ప్రారంభంకాగా, ఉదయం 9 నుంచి 10 గంటల వరకు, మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల వరకు క్లాసులు నిర్వహిస్తున్నారు. ఆయా అధ్యాపకులు మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ వంటి సబ్జెక్టుల్లో కోచింగ్ ఇస్తున్నారు. అయితే కోచింగ్ ప్రక్రియ అరకొర సదుపాయాలతోనే కొనసాగుతోంది. ఇంటర్మీడియట్ బోర్డు ఇప్పటివరకు కోచింగ్‌కు సంబంధించిన మెటీరియల్ పంపించలేదు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో కనీసం నీటి సదుపాయం కూడా లేదు. కొన్నిచోట్ల ప్రిన్సిపాల్స్ సొంత డబ్బుతో నీటి వసతి, చిన్న, చిన్న మరమ్మతు పనులు చేయిస్తున్నారు. కలెక్టర్ స్పందించి నిధులు మంజూరు చేయాలని విద్యార్థులు, తల్లిదండ్రులు, అధ్యాపకులు కోరుతున్నారు. తరగతులు ఉదయం ఒక గంట, సాయంత్రం ఒక గంట కాకుండా.. ఉదయం లేదా సాయంత్రం ఒక పూటే నిర్వహిస్తే సౌకర్యంగా ఉంటుందని విద్యార్థులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం ఇంటర్ రెండో సంవత్సరం విద్యార్థులకు కోచింగ్ ఇస్తుండగా, మొదటి సంవత్సరం విద్యార్థులకు కూడా ఇస్తే బాగుంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ప్రత్యేక సమయం కేటాయించాలి



ఎంసెట్, నీట్, జేఈఈ కోచింగ్‌కు సంబంధించి కళాశాలలో ప్రత్యేక సమయం కేటాయించాలి. కోచింగ్, అనంతరం సబ్జెక్టుల బోధన.. రెండు కలపడంతో అయోమయానికి గురికావాల్సి వస్తోంది. కోచింగ్ సండే కూడా పెడితే బాగుంటుంది.

– ఎస్.ప్రేమ్‌సన్, విద్యార్థి

మెటీరియల్ పంపించాలి



కోచింగ్‌కు సంబంధించిన మెటీరియల్ అందించాలి. మెటీరియల్ ఉంటే ఇళ్లలో కూడా చదువుకునేందుకు అనుకూలంగా ఉంటుంది. ఇంటర్మీడియట్ బోర్డు స్పందించి వెంటనే మెటీరియల్ పంపించాలి.

– ఎస్.జెరుషా, విద్యార్థిని

ఎంతో ప్రయోజనం



ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో నీట్, జేఈఈ, ఎంసెట్ కోచింగ్ విద్యార్థులకు ఎంతో ప్రయోజనం. ప్రైవేటులో రూ.వేల ఖర్చుతో జరిగే కోచింగ్ సర్కారు కళాశాలల్లో ఉచితంగా ఇస్తున్నారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి.

– సులోచనారాణి, జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి

మావోయిస్టు కొరియర్ల అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ రోహిత్ రాజ్

భద్రాచలంఅర్బన్: ఇద్దరు మావోయిస్టు పార్టీ కొరియర్లను చర్ల పోలీసులు, స్పెషల్ పార్టీ సిబ్బంది, 141 బెటాలియన్ సీఆర్పీఎఫ్ సిబ్బంది అరెస్ట్ చేశారు. గురువారం భద్రాచలం ఏఎస్పీ రోహిత్ రాజ్ తన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఏఎస్పీ కథనం ప్రకారం... చర్ల పట్టణ శివారులోని లక్ష్మీ కాలనీలో పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ క్రమంలో మావోయిస్టు పార్టీకి పేలుడు పదార్థాలు చేరవేస్తున్న కొరియర్లు పల్లపు సమ్మయ్య, పల్లపు సత్యవేణిలను అరెస్ట్ చేశారు. విచారించగా ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని రాంపురం, కొండపల్లి, భీమారం సంతలలో కూరగాయల వ్యాపారం చేస్తూ నిషేధిత మావోయిస్టు పార్టీ దళ నాయకులతో పరిచయం పెంచుకుని కొరియర్లుగా వ్యవహరిస్తున్నారు. రెండేళ్లుగా మావోయిస్టు భద్రాద్రి కొత్తగూడెం డివిజన్ కార్యదర్శి ఆజాద్ దళానికి కొరియర్లుగా పనిచేస్తున్నట్లు తేలింది. నిత్యావసర వస్తువులు, మందుపాతరలు తయారు చేయడానికి అవసరమయ్యే కార్డెక్స్ వైరు, ప్రెషర్ కుక్కర్లు, ఇతర పేలుడు పదార్థాలను మావోయిస్టులకు చేరవేస్తున్నారు. వారి నుంచి 200మీటర్ల కార్డెక్స్ వైర్ బండిల్, 12 లీటర్ల సామర్థ్యం ఉన్న పది ప్రెషర్ కుక్కర్లు, పేలుడు పదార్థాల తయారీకి ఉపయోగించే వివిధ రసాయనిక పదార్థాలను, వాటిని తరలించడానికి ఉపయోగిస్తున్న ట్రాక్టర్, ట్రాలీని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను భద్రాచలం కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రిమాండ్ విధించారని ఏఎస్పీ తెలిపారు.

మూడెకరాల భూమి ఇవ్వాలి

మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు రవి

భద్రాచలంటౌన్: తెలంగాణ సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ ప్రకారం ఏజెన్సీలోని దళితులకు మూడెకరాల భూమి ఇవ్వాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు తాళ్లపల్లి రవి డిమాండ్ చేశారు. భద్రాచలం పట్టణంలోని గిరిజన అభ్యుదయ భవనంలో గురువారం జరిగిన ఏజెన్సీ మాల గర్జన సభలో ఆయన మాట్లాడారు. దళితబంధు పథకం కిందిస్థాయివారికి చేరడం లేదని, ఆయా పార్టీల నాయకులకే పరిమితమవుతోందని ఆరోపించారు. ఐటీడీఏలో దళితులకు సైతం ఉద్యోగ అవకాశం కల్పించాలని, దళితులు సాగు చేస్తున్న పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం పట్టణంలో మాలమహానాడు ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు దాసరి శేఖర్, ఆదివాసీ నాయకుడు సోందె వీరయ్య, రవి, సుధాకర్, వెంకటేశ్వరరావు, సుందరరావు, శ్రీను, ఏవీ.రావు, శ్రీను, ఆశీర్వాదం, ఆమోసు, ప్రదీప్, సతీష్, రవి, చిటిబాబు తదితరులు పాల్గొన్నారు.


సభలో మాట్లాడుతున్న రవి


హెల్త్ డైరెక్టర్‌పై విచారణ చేపట్టాలి

రౌండ్ టేబుల్ సమావేశంలో ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంఘాల నాయకులు


రౌండ్ టేబుల్ సమావేశంలో అభివాదం చేస్తున్న నాయకులు

కొత్తగూడెంటౌన్: రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ గడల శ్రీనివాసరావు అవినీతిపై విచారణ చేపట్టి, పదవి నుంచి తొలగించాలని ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం కొత్తగూడెంలోని పీఆర్ ఫంక్షన్‌హాల్‌లో ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గుగులోతు రాజేష్‌నాయక్ ఆధ్వర్యంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు మాట్లాడారు. భవిష్యత్‌లో రాజకీయంగా తనకు ఉపయోగపడాలనే ఉద్దేశంతో కొందరి రాజకీయ నాయకుల కనుసన్నల్లో దాదాపు 100 మందిని వైద్య ఆరోగ్య శాఖలో ఎలాంటి నోటిఫికేషన్ లేకుండా దొడ్డి దారిన నియమించేందుకు కుట్ర పన్నారని ఆరోపించారు. అర్హత లేకున్నా హెల్త్ డైరెక్టర్ గడల శ్రీనివాసరావు వైద్య ఆరోగ్యశాఖలో డిప్యూటేషన్లు, వర్క్ ఆర్డర్‌లు జారీ చేస్తున్నారని, తనకు ఇష్టం వచ్చిన వారిని కీలక స్థానాల్లో అక్రమంగా నియమించారని విమర్శించారు. వివిధ సంఘాల నాయకులు స్. కె.ప్రసన్న, జేబీ శౌరి, శ్రీనివాస్, వాసం రామకృష్ణ దొర, వెంకటేశ్వర్లు, ఎమ్మార్పీఎస్, గుండా రమేష్, మొగిలి, సూరిబాబు భాస్కర్, బోర్రా సురేష్, కనకం సూరిబాబు, ఫక్రుద్దీన్, మోహన్‌నాయక్, కేశవ్‌నాయక్ పాల్గొన్నారు.

వేతన సవరణలో కాంపెన్సేషన్ పెరిగింది


గేట్‌మీటింగ్‌లో మాట్లాడుతున్న నర్సింహారావు

సింగరేణి(కొత్తగూడెం): ఇటీవల కుదిరిన వేతన సవరణ ఒప్పందంలో యుక్త వయసులేని పిల్లలు ఉండీ ఉద్యోగం చేయలేని కార్మికుల కుటుంబానికి మంత్లీ మానిటరీ కాంపెన్సేషన్ గణనీయంగా పెరిగిందని సీఐటీయూ ప్రధాన కార్యదర్శి, జేబీసీసీఐ సభ్యుడు మందా నర్సింహారావు తెలిపారు. అలాగే, డీపీఈ గైడ్‌లైన్సు పక్కన పెట్టించి రానున్న ఐదేళ్ల కాలానికి 19శాతం ఎంజీబీ సాధించి పెట్టిన ఘనత తమదేనని చెప్పారు. కొత్తగూడెం ఏరియా పరిధిలోని పీవీకే–5షాఫ్ట్, జీకేఓసీ వద్ద గురువారం జరిగిన గేట్ మీటింగ్‌లలో ఆయన మాట్లాడారు. సింగరేణి వ్యాప్తంగా చేపట్టిన నిరసనలతో వేతనాల పెంపు సాధ్యమైందని తెలిపారు. ఈ సమావేశాల్లో బ్రాంచి అధ్యక్షుడు జి.రాజారావుతో పాటు విజయగిరి శ్రీనివాస్, వై.వెంకటేశ్వరరావు, కర్ల వీరస్వామి, ఎల్ల గొండ శ్రీరామ్మూర్తి, కె.రమేష్‌బాబు, పి.నాగేశ్వరరావు, గడల నర్సింహారావు, సమ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

చకచకా మన ఊరు – మన బడి పనులు

పాఠశాలల్లో తనిఖీ చేసిన విద్యాశాఖ ఏడీ


కల్లూరు : విద్యార్థులతో మాట్లాడుతున్న ఏడీ శ్రీనివాసాచారి

కల్లూరు/కల్లూరురూరల్/తల్లాడ: ఖమ్మం జిల్లాలోని పలు పాఠశాలలను పాఠశాలల విద్యాశాఖ అడిషనల్ డైరెక్టర్ శ్రీనివాసాచారి గురువారం తనిఖీ చేశారు. కల్లూరు మండలం నారాయణపురం ఎంపీపీఎస్, కల్లూరు ఎంపీపీఎస్ పాఠశాలలతో పాటు తల్లాడ మండలం రెడ్డిగూడెం పాఠశాలను సందర్శించిన ఆయన మన ఊరు – మన బడి పనుల్లో మరింత వేగం పెంచాలని సూచించారు. ఈ సందర్భంగా కల్లూరులో పనుల పురోగతిని పరిశీలించి, విద్యార్థుల సామర్థ్యాలను పెంపొందించేలా బోధనపై సూచనలు చేశారు. అలాగే, పనులపై ప్రధానోపాధ్యాయులు వంగా రామారావు, సున్నా కృష్ణయ్యతో చర్చించి సూచనలు చేశారు. ఇక తల్లాడ మండలం రెడ్డిగూడెం పాఠశాలలో పనులను కూడా ఏడీ శ్రీనివాసాచారి పరిశీలించారు. తొలిమెట్టులో భాగంగా చేపట్టిన కార్యక్రమాలు, మన ఊరు – మన బడి పనులను పరిశీలించి మరింత వేగం పెంచాలని తెలిపారు.

అట్రాసిటీ కేసు నమోదు

టేకులపల్లి: ప్రేమించి పెళ్లి చేసుకుంటానని నమ్మించి యువతిని మోసం చేసిన యువకుడిపై గురువారం పోలీసులు అట్రాసిటీ కేసు నమోదు చేశారు. బోడు ఎస్ఐ బత్తిని రంజిత్ కథనం ప్రకారం... మండంలోని రామచంద్రునిపేట గ్రామానికి చెందిన దొంతుల సత్యనారాయణ అదే గ్రామానికి చెందిన యువతి దైదా ప్రశాంతిని ప్రేమిస్తున్నానంటూ 8 సంవత్సరాలు వెంటపడ్డాడు. యువతి నిరాకరించడంతో మరో యువతిని వివాహం చేసుకున్నాడు. వివాహమై, ఇద్దరు పిల్లలు కలిగిన తర్వాత కూడా మళ్లీ ఏడాది నుంచి ప్రశాంతి వెంట పడుతున్నాడు. తన భార్యను ఒప్పించి పెళ్లి చేసుకుంటానని నమ్మబలికి శారీరకంగా లొంగదీసుకుని గర్భవతిని చేశాడు. పెళ్లి చేసుకోవాలని బాధిత యువతి అడుగుతుండగా రోజులు దాటవేసుకుంటూ వస్తున్నాడు. ఇంట్లో ఒంటరిగా ఉంటున్న ప్రశాంతి గురువారం ఫిట్స్‌తో కిందపడిపోయింది. స్థానికుల సమాచారంతో తల్లిదండ్రులు 108 అంబులెన్స్‌లో రామవరంలోని ఎంసీహెచ్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు యువకుడిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు.

బంగారు గొలుసు అపహరణ

కొత్తగూడెంఅర్బన్: మహిళ మెడలో బంగారు గొలుసు అపహరించిన సంఘటన గురువారం కొత్తగూడెంలో చోటుచేసుకుంది. త్రీటౌన్ పోలీసుల కథనం ప్రకారం.. పట్టణంలోని గాజులరాజంబస్తీకి చెందిన రిటైర్డ్ జూనియర్ అసిస్టెంట్ ఎస్.కృష్ణకుమారి తెల్లవారుజామున ఇంటి ముందు 4 గంటలకు వాకింగ్ చేసి తిరిగి ఇంట్లోకి వెళ్తోంది. ఈ క్రమంలో గుర్తు తెలియని వ్యక్తి కృష్ణకుమారి మెడలో ఉన్న రెండు తులాల బంగారు గొలుసును లాక్కొని పారిపోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి

రఘునాథపాలెం: చేపల వేటకు వెళ్లిన వ్యక్తి ప్రమాదవశాత్తు మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం... ఖమ్మం రూరల్ మండలం నాయుడుపేటకు చెందిన ఎం.డీ.యాకూబ్ (48) రఘునాథపాలెం మండలంలోని కోటపాడు చెరువులో చేపలు పట్టేందుకు గురువారం మరికొందరికి కలిసి వెళ్లాడు. చేపలు పడుతుండగా యాకూబ్ తీవ్ర అస్వస్థతకు గురికావడంతో గమనించిన సహచరులు ఆయనను ఒడ్డుకు తీసుకొచ్చి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అయితే, యాకూబ్ అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. సమాచారం అందుకున్న యాకూబ్ కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. ఘటనపై కేసు నమోదు చేసినట్లు రఘునాథపాలెం పోలీసులు తెలిపారు.

మంగాపురం టు నేపాల్!

అంతర్జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక

నేలకొండపల్లి: మండలంలోని మంగాపురంతండాకు చెందిన గిరిజన విద్యార్థులు కబడ్డీలో సత్తా చాటుతున్నారు. గత నెల గోవాలో జరిగిన అండర్–19 కబడ్డీ పోటీల్లో ప్రతిభ చాటిన ఇంటర్ విద్యార్థులు భూక్యా నవీన్, గణేష్, సాకేత్, భార్గవ్, ఉదయ్, నవనీత్ కుమార్, గోపి, జానకీరాం నేపాల్‌లో జరగనున్న అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. అక్కడ యూత్ గేమ్స్ కౌన్సిల్ ఆధ్వర్యాన ఇండో – నేపాల్ ఇంటర్నేషనల్ సిరీస్ శుక్రవారం మొదలుకానుంది. ఈ పోటీల్లో పాల్గొనేందుకు విద్యార్థులు నేపాల్ బయలుదేరగా, పాలేరు ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి, సర్పంచ్ భూక్యా సుధాకర్ తదితరులు అభినందించారు.

క్లుప్తంగా

అటవీ జంతువు చర్మం స్వాధీనం?

జూలూరుపాడు: మండలంలోని సురారం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఇంట్లో అడవి జంతువుకు సంబంధించిన చర్మం, కొమ్ములను అటవీశాఖాధికారులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. ఆ వ్యక్తిని అదుపులోకి తీసుకున్న అటవీశాఖ అధికారులు విచారణ చేపట్టారు. పంట పొలంలో అడవి జంతువు వేట కోసం ఉపయోగించిన ఇనుప తీగను కూడా స్వాధీనం చేసుకున్న ఫారెస్టు అధికారులు ఆ వ్యక్తితోపాటు మరి ఎవరైనా ఉన్నారా? అనే కోణంలో విచారణ చేస్తున్నట్లు సమాచారం. ఈ విషయంపై అటవీశాఖ అధికారులు వివరాలు చెప్పేందుకు నిరాకరించారు.

నీటి తొట్టిలో పడి చిన్నారి మృతి


మృతి చెందిన చిన్నారి

చంద్రుగొండ : మండలంలోని మద్దుకూరు గ్రామంలో నీటి తొట్టిలో పడి ఓ చిన్నారి మృతి చెందిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన కుంజా రామకృష్ణ, కృష్ణవేణి(ట్యూషన్ టీచర్) దంపతులకు నాలుగేళ్ల కుమారుడు జర్షల్, ఏడాదిన్నర కూతురు శాన్వీ ఉన్నారు. గురువారం శాన్వీని నాయనమ్మ వద్ద వదిలి అన్నపురెడ్డిపల్లి మండలంలోని భీము నిగూడెంలో జరిగే ఓ శుభకార్యంలో పాల్గొనేందుకు కుమారుడి జర్షల్ తీసుకుని వెళ్లారు. సాయంత్రం వేళ ట్యూషన్ పిల్లలు రాగా వారితో కలిసి శాన్వీ ఆడుకుంటుండగా నాయనమ్మ లక్ష్మి ఇంట్లో పనిలో నిమగ్నమైంది. కొద్దిసేపటి తరువాత శాన్వీ కన్పించకపోవడంతో వెతకగా పక్కింట్లో నీటితొట్టిలో పడి అపస్మారక స్థితిలో కన్పించింది. వైద్యం కోసం కొత్తగూడెం తరలించగా అప్పటికే పాప మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. చిన్నారి మృతితో ఆ కుటుంబంలో విషాదం నెలకొంది.

11 రామచిలుకలు మృతి

టేకులపల్లి: మండలంలోని దాసుతండా పంచాయతీ సింగ్యతండా సమీపంలో ఉన్న బోడ భోజ్య, భూక్య కృష్ణ తదితర రైతుల జొన్న, మొక్కజొన్న చేలల్లోకి ఆహారం కోసం రామచిలుకలు వచ్చాయి. చేను మీదుగా వెళ్తున్న 11 కేవీ విద్యుత్ తీగలపై వాలి 11 రామచిలకలు విద్యుదాఘాతంతో మృతి చెందాయని రైతు గుగులోత్ జామ్లా తెలిపారు.

వ్యక్తికి ఆరు నెలలు జైలుశిక్ష

భద్రాచలంఅర్బన్: చెల్లని చెక్కు కేసులో ఓ వ్యక్తికి ఆరు నెలలు జైలుశిక్ష విధిస్తూ గురువారం భద్రాచలం జ్యుడీషియల్ కోర్టు తీర్పునిచ్చింది. వివరాలిలా ఉన్నాయి. మైనేని నటరాజ్ అనే వ్యక్తి జగదల్పూర్ నుంచి వ్యాపారం నిమిత్తం భద్రాచలం వచ్చాడు. ఈ క్రమంలో భద్రాచలానికి చెందిన వెంకటేశ్వర్‌రెడ్డి దగ్గర రూ.4 లక్షలు అప్పు తీసుకుని, తిరిగి చెక్కు ఇచ్చాడు. చెక్కును బ్యాంకులో డిపాజిట్ చేయగా ఖాతాలో సరిపడా నగదు లేకపోవడంతో బౌన్స్ అయింది. దీంతో వెంకటేశ్వర్‌రెడ్డి తన న్యాయవాది డి.రాము ద్వారా కోర్టులో కేసు వేశాడు. పూర్వాపరాలు పరిశీలించిన న్యాయస్థానం ముద్దాయి నటరాజ్‌కు ఆరు నెలల జైలు శిక్షతో పాటు రూ.4లక్షలు చెల్లించాలని గురువారం తీర్పునిచ్చింది. రెండు నెలల్లోపు డబ్బులు కట్టని పక్షంలో మరో మూడు నెలలు శిక్ష పొడిగించనున్నట్లు తీర్పులో పేర్కొంది.

డిగ్రీ విద్యార్థిని అదృశ్యం

పాల్వంచరూరల్: డిగ్రీ విద్యార్థిని అదృశ్యంపై గురువారం కేసు నమోదయింది. పోలీసుల కథనం ప్రకారం.. సుజాతనగర్ మండలం సీతంపేటబంజర గ్రామానికి చెందిన బానోతు అంజలి పాల్వంచలోని కేఎల్ఆర్ కళాశాలలో డిగ్రీ చదువుతోంది. బుధవారం అంజలిని తన తండ్రి జగదీష్ ద్విచక్రవాహనంపై తీసుకొచ్చి లక్ష్మీదేవిపల్లిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల పరీక్షా కేంద్రం వద్ద దింపి వెళ్లాడు. మళ్లీ మధ్యాహ్నం తీసుకెళ్లేందుకు రాగా అంజలి కన్పించలేదు. పలుచోట్ల వెతికినా ఆచూకీ లేదు. విద్యార్థిని తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

బిల్ కలెక్టర్లను ఆర్టిజన్లుగా గుర్తించండి


ధర్నాలో పాల్గొన్న బిల్ కలెక్టర్లు

ఖమ్మంవ్యవసాయం: ఆర్టిజన్లుగా గుర్తించి కనీస వేతనాలు చెల్లించాలనే డిమాండ్‌తో విద్యుత్ బిల్ కలెక్టర్లు గురువారం కలెక్టరేట్ ఎదుట ఉన్న ధర్నాచౌక్‌లో నిరసన తెలిపారు. కనీస వేతనం రూ.26 వేలుగా నిర్ణయించాలని, ఈపీఎఫ్, ఈఎస్ఐ, సౌకర్యాలను కల్పించాలని డిమాండ్ చేశారు. ధర్నాలో సీఐటీయూ అనుబంధ టీఎస్‌యూఈఈఏ కార్యదర్శి ఎం.ప్రసాద్ మాట్లాడగా.. జిల్లా కార్యదర్శి కామినేని నాగేశ్వరరావుతో పాటు ఎస్.సీతయ్య, వై.విక్రమ్, రమ్య, వెంకన్న తదితరులు మద్దతు తెలిపారు. ధర్నాలో బిల్ కలెక్టర్ల సంఘం జిల్లా అధ్యక్షులు బి.ప్రభాకర్, జి.గురునాథం, సీహెచ్.శ్రీనివాసరావు, పాశం నాగేశ్వరరావు, హరి, కోటేశ్వరరావు, పి.సత్యనారాయణ, దినేష్, భరత్, నరేష్, ఎస్.కే.రహీం, వినోద్‌కుమార్, షేక్ జానీ తదితరులు పాల్గొన్నారు.

బాలికలకు సముచిత గౌరవం

డీఈఓ సోమశేఖర శర్మ


మాట్లాడుతున్న డీఈఓ సోమశేఖరశర్మ

కొత్తగూడెంఅర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లో బాలికలకు సముచిత గౌరవం దక్కుతుందని డీఈఓ సోమశేఖర శర్మ అన్నారు. కొత్తగూడెంలోని బాబుక్యాంపు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 'బాలికా విద్య, రక్షణ' అనే అంశంపై గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పాఠశాల సమయంలో బాలికలకు ఎవరి వల్ల అయినా ఇబ్బందులు తలెత్తితే వెంటనే సంబంధిత హెచ్‌ఎం దృష్టికి తీసుకురావాలని సూచించారు. కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలని, క్రమశిక్షణతో ఎదగాలని అన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మధురవాణి, ఉపాధ్యాయులు విజయ, జ్యోతి, శ్రీదేవి, స్వరూప, పద్మజ, పుష్పారాణి పాల్గొన్నారు.

పాఠశాలల్లో తనిఖీ..

కొత్తగూడెం, చుంచుపల్లి మండలంలోని పలు ఉన్నత పాఠశాలలను డీఈఓ సోమశేఖరశర్మ గురువారం తనిఖీ చేశారు. మన ఊరు–మన బడి పనులతో పాటు విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడి గణితం, భౌతిక, రసాయన శాస్త్రాలలో కొన్ని ప్రశ్నలు అడిగారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ కో–ఆర్డినేటర్లు ఎ.నాగరాజశేఖర్, ఎస్‌కే.సైదులు, ఎన్.సతీష్‌కుమార్, ఎంఈఓ జుంకీలాల్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమాలకు అడ్డుకట్ట పడేనా ?

నెల్లిపాక సొసైటీ అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని రైతుల వేడుకోలు

అశ్వాపురం: మండల పరిధిలోని నెల్లిపాక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో అవకతవకలు, అక్రమాలకు అడ్డుకట్ట పడటం లేదు. సంఘం పరిధిలో పెద్ద సాగునీటి వనరైన తుమ్మలచెరువు ఉండటంతో ధాన్యం కొనుగోలులో సొసైటీ జిల్లాలోనే అగ్ర స్థానంలో ఉంటోంది. ఆదాయం కూడా అధికంగానే ఉండేది. సొసైటీలో 1,898 మంది సభ్యులు ఉన్నారు. గతంలో అవార్డులు, ప్రశంసలు పొంది ప్రత్యేక గుర్తింపు సాధించింది. కాగా కొన్నేళ్లుగా సొసైటీలో నిధుల దుర్వినియోగం, అవకతవకలు, అక్రమాలు వెలుగులోకి వస్తుండటంతో డిపాజిట్లు, బంగారు రుణాలు, ఇతర ఆర్థిక లావాదేవీలు తగ్గిపోయాయి. ఆదాయం కూడా పడిపోతోంది. గత పాలకవర్గం హయాంలో అవకతవకలు చోటు చేసుకోగా అధికారులు విచారణ చేపట్టారు. ఆ నివేదిక వెల్లడించి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని అఖిలపక్ష పార్టీల నాయకులు, రైతులు కలెక్టర్, ఇతర అధికారులకు పలుమార్లు విన్నవించారు. బాధ్యులపై చర్యలు, సొమ్ము రికవరీ పూర్తి కాకముందే ప్రస్తుత పాలకవర్గ హయాంలో 2021–22 ఏడాది ఆడిట్‌లో రూ.20 లక్షలు దుర్వినియోగం జరిగినట్టు వెలుగులోకి వచ్చింది. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి సహకార సంఘంలో అక్రమాలపై పూర్తి స్థాయి విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

నెల్లిపాక సహకార సంఘంలో గతంలో జరిగిన అక్రమాలపై విచారణ జరిగింది. బాధ్యులపై చర్యలు, సొమ్ము రికవరీ సమయంలో ఓ వ్యక్తి కోర్టుకు వెళ్లడంతో ఆ ప్రక్రియ నిలిచిపోయింది. కోర్టులో క్లియరెన్స్ వస్తే తదుపరి చర్యలు తీసుకుంటాం. 2021–22 సంవత్సరంలో ఆడిట్‌లో రూ.20 లక్షలు దుర్వినియోగమైనట్లు అధికారులు గుర్తించారు. బాధ్యుడిగా సంఘం సీఈఓను సస్పెండ్ చేయాలని ఆదేశించాం. పూర్తి స్థాయి విచారణ జరిపి బాధ్యులందరిపైనా చర్యలు తీసుకుంటాం.

– వెంకటేశ్వర్లు, జిల్లా సహకార అధికారి

'గోదావరి' బాధితులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి


ధర్నా చౌక్‌లో నిరసన తెలుపుతున్న నాయకులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): గోదావరి వరద బాధితులకు, పేదలకు హైకోర్టు ఆదేశాల మేరకు ఇంటి స్థలాలు ఇచ్చి పట్టాలు మంజూరు చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు అవునూరి మధు, గుండాల ఎంపీపీ, ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు ముక్తి సత్యం డిమాండ్ చేశారు. ఈ సమస్యపై 143 రోజులపాటు బూర్గంపాడు మండలంలో ఆందోళన చేపట్టారు. రెండు రోజుల నుంచి జిల్లా కేంద్రం కొత్తగూడెంలోని ధర్నా చౌక్‌లో నిరసన చేపడుతున్నారు. గురువారంతో ఆందోళన 145వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐదు నెలలుగా ఆందోళన సాగిస్తున్నా ప్రభుత్వం స్పందించక పోవడం శోచనీయమని అన్నారు. పార్టీ ఇల్లెందు డివిజన్ కార్యదర్శి తుపాకుల నాగేశ్వరరావు, భద్రాచలం డివిజన్ కార్యదర్శి మోరె రవి, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి కందగట్ల సురేందర్, నాయకులు కుంజా కృష్ణ, బండ్ల వెంకటేశ్వర్లు, కుంజ భద్రమ్మ, పానగంటి వెంకన్న, ఆర్ లక్ష్మి, నాగన్న, భవాని తదితరులు పాల్గొన్నారు.

కృష్ణసాగర్‌లో..

బూర్గంపాడు: గోదావరి వరద బాధితుచాయతీలోని సర్వే నెంబర్ 10లో ఇళ్ల స్థలాలు కేటాయించాలని వరద బాధితులు చేపట్టిన దీక్షలకు సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు గురువారం మద్దతు తెలిపి మాట్లాడారు. అనంతరం బాధితులతో కలసి తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి వినతిపత్రం అందజేశారు. ఎన్డీ నాయకులు పెద్దగోని ఆదిలక్ష్మి జక్కం కొండలరావు, ముత్యాల సత్యనారాయణ, కొండపనేని కృష్ణయ్య, బండ్ల మునెయ్య తదితరులు పాల్గొన్నారు.

క్షుద్ర పూజల కలకలం

జూలూరుపాడు: మండలంలోని భేతాళపాడు, పడమటనర్సాపురం గ్రామల మధ్య బీటీ రోడ్డుపై గుర్తు తెలియని వ్యక్తులు క్షుద్ర పూజలు చేసిన ఆనవాళ్లు గురువారం కన్పించాయి. ఈ ఘటన గ్రామాల్లో కలకలం రేపింది. ఆయా గ్రామాల మధ్య రాకపోకలు సాగించే పలువురు రోడ్డుపై నిమ్మకాయలు, పుసుపు, కుంకుమ, ఇతర వస్తువులను చూసి భయాందోళనకు గురయ్యారు. క్షుద్రపూజలను అరికట్టేందుకు పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

పందెంరాయుళ్ల అరెస్ట్

దమ్మపేట: మండల పరిధిలోని నాగుపల్లి శివారులో నిర్వహిస్తున్న కోడి పందేల స్థావరంపై గురువారం పోలీసులు దాడి చేశారు. నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, రూ.4,230 నగదు స్వాధీనం చేసుకున్నారు. మరో వ్యక్తి పారిపోయాడని, కేసు నమోదు చేశామని ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపారు.